# సూతకం

## కిల్లాన మోహన్‌బాబు

మార్కండేయ శాస్త్రి ముఖం గంభీరంగా ఉంది. కళ్లు ఎర్రగా ఉన్నాయి. గడ్డం బాగా మాసిపోయి ఉంది. తైల సంస్కారం లేక జుత్తు కూడా పొడిగా వుంది. అతని చేతిలో ఓ రుద్రాక్షమాల ఉంది. ఆరోజు కార్తీక పౌర్ణమి. సాయంత్రం భాస్కరరాజు గారింట్లో కేదారేశ్వర వ్రతం చేయించాలి. పూజ దగ్గర చదవవలసిన మంత్రాలు మరోసారి మననం చేసుకుంటున్నారాయన.

ముప్ఫయి ఏళ్లుగా సాగుతున్న అతని పౌరోహిత్య జీవితంలో ఇలా ఇంటిదగ్గర కూర్చుని కొత్తగా సాధన చేయవలసిన పనిలేదు. కానీ గుండె లోతుల్లోంచి పొంగివొస్తున్న దుఃఖాన్ని తాత్కాలికంగానైనా అణచిపెట్టడానికి అది అతను చేస్తున్న చిన్న ప్రయత్నం మాత్రమే!

మంత్రోచ్చారణ పూర్తయింది. ఒకసారి ఇంటిని కలియ జూశాడతను. ఎప్పుడో డెబ్భయి ఏళ్ల క్రితం కట్టిన కొంప. గోడలన్నీ శిథిలావస్థలో వున్నాయి. ఇంటి కప్పులోని కన్నాలలోంచి వెలుగు కిరణాలు లోపలి కొస్తున్నాయి. అతను కూర్చున్న ఉయ్యాల అటూఇటూ ఊగుతోంది. ఆ ఉయ్యాల ఆ ఇంటి గతవైభవ చిహ్నంలా మిగిలింది. ఆ గదికి ఆనుకునివున్న మరో చిన్నగదిలోంచి చిన్నగా, సన్నగా మూలుగులు వినిపిస్తున్నాయి. అవి శాస్త్రిగారి తల్లిగారివి... ఆమెకు అయిదేళ్ల క్రితం పక్షవాతం వచ్చి మంచం పట్టారు. అప్పట్నుంచీ అలాంటి మూలుగులకి శాస్త్రిగారు అలవాటు పడ్డారు. ముగ్గురాడపిల్లలూ స్కూలుకి వెళ్లినట్లున్నారు. శాస్త్రిగారి కళ్లు గోడమీద వున్న ఫోటో మీద పడ్డాయి. అతని తమ్ముడు విశ్వనాథశర్మ ఆ మధ్య ఇంటికి వచ్చినపుడు కుటుంబ సభ్యులందర్నీ కూర్చోబెట్టి తీసిన కలర్ ఫోటో అది! విశ్వనాథశర్మ హైదరాబాద్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా ఉంటున్నాడు. 'తమ్ముడి జీవితానికేం ఢోకా లేదు... తన బతుకే ఇలా తగలడింది' అని తను అనుకోని క్షణం లేదు.

'ఎవరి అదృష్టాలు వారివి. దానికి మనమేం చేస్తాం' అన్న సిద్ధాంతంతో తాను సరిపెట్టుకున్నా తన భార్య కామాక్షమ్మ మాత్రం రాజీ పడలేక పోయింది.

కాఫీ తాగాలనిపించింది శాస్త్రిగారికి.

"కామాక్షీ" పిలిచారు శాస్త్రిగారు.

వంటింట్లోంచి కామాక్షమ్మ చేతులు తుడుచుకుంటూ వచ్చింది.

"కొంచెం కాఫీపెట్టు" ఆమెవైపు చూస్తూ బతిమాలుతున్నట్లుగా అడిగారు శాస్త్రిగారు.

"పాలు లేవండీ. అత్తయ్యగారు కాఫీ కావాలంటే ఇందాకే ఇచ్చాను. కావాలంటే డికాషన్ కొంచెం వుంది. వేడి చేసి ఇస్తానుండండి" అనేసి లోపలికి వెళ్లిపోయింది కామాక్షమ్మ.

తన బతుకులో ఏ కోరిక తీరింది గనుక? ఇలాంటి కనీసపు కోరికలు కూడా తీరని జీవితాలివి!

తల్లి మూలుగులు ఎక్కువయ్యాయి!

"బా... బూ..." అతికష్టంమీద పిలిచింది శాస్త్రిగారి తల్లి.

ఉయ్యాల్లోంచి లేచి తల్లి పడుకున్న గదిలోకి వెళ్లారు మార్కండేయ శాస్త్రిగారు.

"బాబూ... వచ్చావా ఇలా కూర్చో... చిన్నవాడు రాసిన ఉత్తరం మరోసారి చదువుతావా?" అందామె అతికష్టం మీద.

ఆమెవైపు సూటిగా చూశారు శాస్త్రిగారు.

తనకు జన్మనిచ్చిన తల్లి!

అయిదేళ్లుగా మంచం పట్టిన దురదృష్ట వంతురాలు!

ఆమె జబ్బుకి సరైన మందులు కూడా ఇప్పించలేని బతుకీడుస్తున్నాడు తాను. ఈ రోజుల్లో పౌరోహిత్యం మీద పొట్ట పోసుకుందామంటే అయ్యేపని కాదు! స్కూటర్లమీద తిరుగుతూ వచ్చిన వాళ్లకి అనుకూలంగా దొంగ ముహూర్తాలు పెట్టి మోసంచేసే కుహనా వాళ్లదే కాలం! ఇలాంటి వాటిలో రాజీ పడలేక ఇలా దరిద్రం అనుభవిస్తున్నాడు తను! తన తండ్రి తనని పౌరోహిత్యంలోకి దింపి పెద్ద పొరపాటు చేశాడు. తన వారసత్వం ఇద్దరి కొడుకుల్లో ఒకరికైనా రావాలన్న తండ్రి మొండి పట్టుదలే తన జీవితాన్ని దెబ్బ తీసింది.

"ఏమిటాలోచిస్తున్నావ్ బాబూ!" అని పెద్దగా దగ్గిందావిడ.

"ఏంలేదు... ఎలా వుందమ్మా నీ ఒంట్లో" అడిగారు శాస్త్రిగారు.

"క్షణాలు లెక్క పెడుతున్నా(నా)" అందామె నీరసంగా.

"అలా అనకమ్మా... నీకు తప్పక బాగవుతుంది. లేచి తిరుగుతావు కూడా" ఇలా అంటున్నప్పుడు అతని కంఠం వణికింది.

"చిన్నవాడి ఉత్తరం మరోసారి చదువు బాబూ!" అడిగిందామె దీనంగా.

ఎదురుగా వున్న తనకంటే ఎక్కడోవున్న విశ్వనాథశర్మ మీద ఆమెకి మక్కువ ఎక్కువ!

తమ్ముడిమీద అసూయ కలిగింది శాస్త్రిగారికి.

ఏనాడూ తల్లి గురించి అంతగా పట్టించుకోని విశ్వనాథ శర్మ గురించే ఆమె ఎప్పుడూ ఆలోచిస్తుందేమో ఈ ఆలోచన రాగానే తల్లిమీద కూడా కించిత్ కోపం వచ్చింది శాస్త్రిగారికి...

"ఉండమ్మా... ఆ వుత్తరం ఇప్పుడే తెస్తాను!" అంటూ గది బయటకొచ్చారు శాస్త్రిగారు.

"టేబిల్‌మీద డికాషన్ వుంచాను తాగండి" వంటింట్లోంచి కేకేసింది కామాక్షమ్మ.

ఉత్తరాలు తగిలించే సన్నని వైర్ లోంచి ఆ మధ్యకు విశ్వనాథశర్మ రాసిన ఉత్తరం బయటకు తీశారు శాస్త్రిగారు. డికాషన్ తాగి మళ్లీ తల్లి దగ్గరకెళ్లారు.

ఆమె మంచంమీదే కూర్చుని ఉత్తరం చదవడం ప్రారంభించారు శాస్త్రిగారు,

"అన్నయ్యకు నమస్కారములు...

మీరు వ్రాసిన ఉత్తరం అందింది. అమ్మ ఆరోగ్యం రోజురోజుకీ దిగ జారుతున్నట్లు తెలిపి ఇక్కడ అందరం బాధపడ్డాం... వీలుంటే అమ్మను హైదరాబాద్ తీసుకుపొమ్మని వ్రాశావ్... ఇక్కడ మంచి డాక్టర్లున్న మాట నిజమే అయినా ఈ పరిస్థితుల్లో అమ్మను మంచంమీంచి కదపడం అంత మంచిది కాదేమో ! అదీకాక నేను ఏ క్షణాన ఇంగ్లాండు వెళ్తానో తెలీదు. పాస్‌పోర్టు, వీసా అన్నీ సిద్ధంగా వున్నాయి... అక్కడనుండి కబురు రావడమే ఆలస్యం. ఈలోగా ఎప్పటికప్పుడు అమ్మ ఆరోగ్య పరిస్థితి గురించి తెలియజేస్తూ ఉండండి... మీ మరదలి ఆరోగ్యం కూడా అంతంత మాత్రం... వదినగారి ఓపికా ఓర్పూ ఈమెకు లేవు... నేను మొన్న పంపిన..." చదవడం ఆపారు శాస్త్రిగారు. తల్లి కళ్లు చెమ్మగిల్లి ఉన్నాయి. ఒక్క క్షణం ఆగాక మళ్లీ చదవడం ప్రారంభించారు శాస్త్రిగారు.

"... ... ... మరి వుంటాను. అమ్మకూ, వదినగారికీ నమస్కారములు. పిల్లలకి ఆశీస్సులు.

ఇట్లు మీ తమ్ముడు,

విశ్వనాథశర్మ"

తన భుజంమీది తుండుగుడ్డతో ఆమె ముఖాన్ని తుడిచారు శాస్త్రిగారు. ఆమె కళ్లు నిర్జీవంగా నిస్తేజంగా... నీరసంగా వున్నాయి. క్షణాలు దగ్గర పడుతున్నాయేమో అన్పించిందతనికి. ఈ ఆలోచన రాగానే ఒళ్లు ఝల్లుమంది.



తల్లి బుగ్గలమీంచి కన్నీరు ధారాపాతంగా కారుతోంది. అవి తుడుచుకోడానికి ఆమె ప్రయత్నించడం. ఆమె చేయి లేవకపోవడం చూసిన శాస్త్రిగారి గుండెల్ని ఎవరో పిండినట్లయింది.

తన భుజంమీద తుండుగుడ్డతో ఆమె ముఖాన్ని తుడిచారు శాస్త్రిగారు. ఆమె కళ్లు నిర్జీవంగా నిస్తేజంగా... నీరసంగా వున్నాయి.

క్షణాలు దగ్గర పడ్తున్నాయేమో అన్పించిందతనికి. ఈ ఆలోచన రాగానే అతని ఒళ్లు ఝుల్లుమంది.

సాయంత్రమే కేదారేశ్వర వ్రతం చేయించాలి. భాస్కరరాజు గారింటికి వెళ్తే సంభావనలు, దక్షిణలు ఘనంగా ముడతాయి. "అసలా వుద్దేశంతోనే..." గతుక్కుమన్నారు శాస్త్రిగారు.

తన ఆలోచనలిలా పరుగెడ్తున్నాయేమిటి?

తల్లి చావు బతుకుల మధ్య ఊగిసలాడుతుంటే తానుమాత్రం తనకి రావలసిన సంభావనల గురించి ఆలోచిస్తున్నాడు!

హు... పరిస్థితులు! ఎంత విచిత్రమైనవి?

పేదరికం! ఎంత దరిద్రమైనది?

ప్రపంచంలోని అన్ని బంధాలను అవహేళన చేస్తూ ఆఖరికి తల్లీ తనయులను కూడా మానసికంగా విడదీస్తున్న ఆ డబ్బు అనేది ఎంత నీచమైనది!

"పడుకోమ్మా. మరేం బాధపడకు" అని ఆమెకు దుప్పటికప్పి నెమ్మదిగా బయటికొచ్చి ముందు గదిలోని ఉయ్యాల్లో కూర్చున్నారు శాస్త్రిగారు.

చేతిలో తమ్ముడు రాసిన ఉత్తరం.

ఎంత స్వార్థపరుడు తన తమ్ముడు?

తాను విదేశానికి వెళ్లాలని... అమ్మకి ఏమైనా జరిగితే వెంటనే తెలియజేయమని ఎంత తెలివిగా రాశాడు?

తన విదేశీ పర్యటనకు తల్లి మరణం అవరోధం అవుతుందేమోనన్న భయం ఆ వాక్యములలో స్పష్టంగా కనిపించింది!

ఏనాడూ ఇంటి గురించిగానీ, తల్లి గురించిగానీ పట్టించుకోని విశ్వనాథ శర్మంటేనే తల్లికి కూడా వల్లమాలిన అభిమానం!

ఓ రకంగా చూస్తే తను కూడా స్వార్థపరుడే!

తల్లికి మందులు కొనమని ఆ మధ్య తమ్ముడు పంపిన అయిదు వందల రూపాయల్లో వంద మాత్రమే మందులకు వాడి మిగిలిన నాలుగు వందలూ పచారీకొట్టుకి జమకట్టిన తాను మాత్రం స్వార్థపరుడు కాదా? అందుకే ఇందాక తల్లిదగ్గర ఉత్తరం చదువుతున్నప్పుడు తమ్ముడు రాసిన "నేను పంపిన..." అనే వాక్యాన్ని చదవకుండా దాటవేశాడు తెలివిగా.

తల్లీ తనయులకు డబ్బు అనే పిశాచి ఎలా దోబూచులాడుతోందో?

ఇందాక తల్లి ముఖం చూసినపుడు తాను సాయంత్రం వెళ్లవలసిన పూజ విషయం కూడా గుర్తొచ్చిన క్షణం తాను మరిచిపోలేదు!

ఈ పూజకి వెళ్తే తన కుటుంబానికి మరో పదిహేను రోజుల వరకూ భత్యానికి లోటుండదు. కానీ తల్లి గురించి మనసెందుకో కీడు శంకిస్తోంది. కడుపులో ఆకలి కరకర మంటుంది.

అయినా 'ఉపవాసం' అన్నపేరుతో 'పస్తు' అన్నదాన్ని కప్పేశారు ఆ ఇంట్లోవాళ్లు ఆరోజు.

ఉండి తినకపోతే ఉపవాసం!

లేక తినకపోతే పస్తు!

ఆరోజు ఇంట్లో సరుకులు లేక 'ఉపవాసం ఉందాం' అని ఉదయాన్నే సరిపెట్టుకున్నారందరూ వాళ్లకి కార్తీక మాసంలో కేదారేశ్వర వ్రతం చేసే ఆనవాయితీ లేకపోయినా!

ఇందాక తన తల్లి కళ్లు మూసిన క్షణంలో నాటుకున్న భయం రానురాను పెరిగి పెద్దదై భూతంలా తన ఆలోచనలని కమ్మేసింది!

సాయంత్రం లోపు ఆమె కేమయినా జరిగితే! మరి తాను భాస్కరరాజు గారింటికి వ్రతానికి వెళ్లలేడు! రావలసిన డబ్బూ దస్కం రావు!

మరో పదిహేను రోజుల భత్యం చేజారిపోతుంది!

కారణం! సూతకం!

అయితేనేం పూజకు ఎందుకు వెళ్లకూడదు? ఇంట్లో వాళ్లందరూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తన తల్లిని ఏనాడో మానసికంగా చంపేశారు. అంచేత ఆ సూతకమనేది వుంటే అది ఏనాడో అందర్నీ అంటుకుంది. ఒకవేళ తన తల్లి ఈరోజు మరణిస్తే ఈ బాధలనుండి విముక్తి లభించి తమకు అసలైన 'సూతకం' వదిలి పోతుంది.

తన ఆలోచనలు ఇలా పరిగెడ్తున్నాయేమిటి?

పట్టుతప్పి పరుగెడ్తున్న వాటిని ఆపే శక్తి తాను ఏనాడో కోల్పోయాడు!

వీధిలోకొచ్చి ఎవరో వెళ్తుంటే ఆపి టైం అడిగారు శాస్త్రిగారు. 'మూడు' అని చెప్పి వెళ్లిపోయాడతను. తల్లి గదిలోంచి మూలుగులు అంతగా వినబడడంలేదు... గది దగ్గరకు వెళ్లారు శాస్త్రిగారు... అతని గుండెలు తీవ్రంగా కొట్టుకుంటున్నాయి.

డాక్టర్ని పిలిపించి తల్లిని ఓసారి చూపిస్తే?

తన దగ్గర చిల్లిగవ్వ లేదు.

మళ్లీ వెనక్కి వచ్చి ఉయ్యాల్లో కూర్చున్నారు శాస్త్రిగారు.

ఇంతలో కామాక్షమ్మ అక్కడికి వచ్చింది.

"ఏమండీ... ఇంకా ఇక్కడే వున్నారు? రాజు గారింటికి వెళ్లరా? సాయంత్రం మీరు అక్కడనుండి తెచ్చే సరుకులు చూసే మనింట్లో పొయ్యిలోని పిల్లి లేస్తుంది" హెచ్చరిస్తున్నట్లుగా అంది కామాక్షమ్మ.

"గదిలోకెళ్లి అమ్మకెలా ఉందో చూడు" నెమ్మదిగా అన్నారు శాస్త్రిగారు.

కామాక్షమ్మ గదిలోకెళ్లి కొంతసేపు తరువాత తిరిగొచ్చింది.

"అత్తయ్యగారు నిక్షేపంగా నిద్ర పోతున్నారుగాని మీరుముందు కదలండి" అంది.

నెమ్మదిగా బయటకు నడిచారు శాస్త్రిగారు. ఆరోజు భాస్కరరాజు గారింట్లో కేదారేశ్వర వ్రతం చాలా బాగా జరిగింది. పూజానంతరం రాజుగారు శాస్త్రిగారికి నూట పదహార్లూ, బియ్యం, పప్పులూ ఇచ్చారు. "మీ అమ్మగారి కెలావుంది శాస్త్రిగారూ?" అడిగారు రాజుగారు హఠాత్తుగా.

"ఈవాళో రేపో అన్నట్లుగా ఉందండీ!" శాస్త్రిగారిలా అంటున్నప్పుడు గొంతు వణికింది.

ఆ సరుకులన్నీ రిక్షాలో వేసుకుని ఇంటికి బయలుదేరారు శాస్త్రిగారు. దూరంగా ఇంటిదగ్గర... ఏదో హడావుడి... ఏడుపులు... కామాక్షమ్మ గొంతు బిగ్గరగా... అర్థమయిపోయింది శాస్త్రిగారికి. సరుకులన్నీ వరండాలోకి విసిరి తల్లి శవంమీదపడి మూర్ఛపోయారు శాస్త్రిగారు... కామాక్షమ్మ శాస్త్రిగారి ముఖంమీద నీళ్లు జల్లింది... ఆమె కళ్ళు ఎర్రగా ఉబ్బిఉన్నాయి. ఆమె మస్తిష్కం మండిపోతోంది! భర్త పూజకు బయలుదేరక ముందే అత్తయ్యగారి ప్రాణం పోయిందని, ఈ విషయం భర్తకు తెలిస్తే రాజుగారింటికి వెళ్లకుండా ఆగిపోవాలి కాబట్టి కావాలనే ఈ నిజాన్ని ఆమె దాచిపెట్టింది! ఆమె గుండెల్లోనే నిక్షిప్తమయి పోయిన ఈ నిజం ఆమెను నిలువునా దహించి వేస్తోంది! *

---



## లంచ్ టైం

హోటల్ కెళ్ళి కుర్చున్నాడు కామేశం.

"ఏం కావాలిసార్" అడిగాడు సర్వర్.

"ఏం వద్దులే... ఆకలిగా లేదు" చెప్పాడు కామేశం.

"మరయితే ఇక్కడికెందుకొచ్చారు?"

"ఇది నా లంచ్ టైమయ్యా... ఏం చెయ్యను మరి" చెప్పాడు కామేశం.

—కొప్పరపు నాగేశ్వరరావు
(నరసరావుపేట)




